క్లుప్తంగా

రంగస్థల నటుడికి ఉత్తమ సాహిత్య పురస్కారం



నగరంపాలెం: ఏటీఅగ్రహారం ప్రాంతానికి చెందిన వైఎస్ కృష్ణేశ్వరరావ్‌కు మంగళవారం ఈశ్వర వరప్రసాద పరిషత్తు రూ.50 వేలు, శాలువా, జ్ఞాపికతో సత్కరించి ఉత్తమ సాహిత్య పురస్కారాన్ని అందించారు. చిన్నతనం నుంచి రంగస్థలంపై మక్కువ పెంచుకుని నటుడిగా, దర్శకుడిగా, రచయితగా రాణించి చిత్ర రంగంలో పలు చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించారని గుర్తుచేసుకున్నారు. అంతేగాక నంది అవార్డులు కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిషత్ చైర్మన్ మోదుగుల రవికృష్ణ, సభ్యులు సెట్లం చంద్రమోహన్, పి.సత్యనారాయణరాజు, పసుపులేటి శ్రీధర్, మారెళ్ళ వెంకయ్య, కృష్ణేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీదుర్గాస్తుతి విశిష్టతపై ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శ్రీ దుర్గాస్తుతిపై మంగళవారం ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ పాలకమండలి వారు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఉపనిషన్మందిరం సభ్యులు నిష్ఠల నరసింహమూర్తి ప్రసంగిస్తూ అమ్మవారి అనుగ్రహంతో నవావరణలు దాటడమే నిజమైన విజయదశమి అని తెలిపారు.

తెలుగు కవిత్వపు నుడికారం జాషువా



నగరంపాలెం: తెలుగు కవిత్వపు నుడికారం కవికోకిల గుర్రం జాషువా అని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. మహాకవి గుర్రం జాషువా జయంతి వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నగరంపాలెంలోని జాషువా విగ్రహం వద్ద జాషువా సాహిత్యం – సామాజిక సంస్కరణ అంశంపై సభ నిర్వహించారు. సభకు ఉపాధ్యక్షులు అత్తోట జోసఫ్‌కుమార్ అధ్యక్షత వహించారు. తొలుత ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాషువా సాహిత్యంపై విశేష అధ్యయనం చేసిన విశ్రాంత ఉపన్యాసకులు మట్టా విజయశ్రీని సత్కరించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది చందవోలు శోభారాణి, పినపాటి మోహనరావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, కవి దేవరపల్లి ప్రభుదాస్, నల్లపు నీలాంబరం, తాటికొండ నరసింహారావు, బత్తుల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

26న వ్యాసరచన, డిబేట్ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: వారధి ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26న జిల్లా స్థాయిలో వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్‌లో ఉదయం 9.00 గంటలకు పరీక్ష ఉంటుందని చెప్పారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను గైడ్ టీచర్ల సహాయంతో జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు పంపాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా(7842869407), అకడమిక్ మానిటరింగ్ అధికారి రమ్య(98665 53230)ను సంప్రదించాలని సూచించారు.

మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణంపై శిక్షణ

ప్రత్తిపాడు: మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణాన్ని పక్కాగా చేపట్టాలని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ అన్నారు. ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని బొర్రావారిపాలెం గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా మ్యాజిక్ డ్రైన్‌ను నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణంపై గ్రామంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మ్యాజిక్ డ్రెయిన్‌ను ఎలా నిర్మించాలి.. నిర్మాణంలో జాగ్రత్తలు.. ప్రయోజనాలు.. మురుగు పారే విధానం.. వంటి అంశాలపై సిబ్బందికి డైరెక్టర్ షణ్ముఖ ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయోగాత్మకంగా నిర్మిస్తున్న మ్యాజిక్ డ్రెయిన్ వలన మురుగు, దుర్వాసన సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శివప్రసాద్, జాయింట్ కమిషనర్ సునీత, చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపిచంద్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ వి.శంకర్ పాల్గొన్నారు.

వైభవంగా దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు



లాలాపేట దేవస్థానంలో అమ్మవారికి ఐశ్వర్య లక్ష్మీదేవీ అలంకారం



ఆర్ అగ్రహారం కన్యకా పరమేశ్వరి దేవాలయంలో గజలక్ష్మీ అలంకారం



ఏటుకూర్‌రోడ్ కన్యకా పరమేశ్వరి ఎన్‌క్లేవ్‌లో గాయత్రీదేవిగా..



కొత్తపేట జగన్నాథస్వామి ఆలయంలో ధాన్యలక్ష్మీదేవి అలంకారం

నగరంపాలెం: నగరంలోని పలు దేవాలయాల్లో శ్రీ దేవీశరన్నవరాత్ర మహోత్సవాలు మంగళవారం రెండో రోజుకి చేరాయి. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అలంకారాలతో అలంకరించారు. అలంకారాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లను పరిసర ప్రాంతాల్లోని భక్తులకు దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. సువాసినులతో కుంకుమార్చనలు, సాయంత్రం దంపతులతో అమ్మవారి సహస్రనామ పూజలు నిర్వహించారు. విశేష హారతి మంత్రపుష్పం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. హోమాలలో భాగంగా గాయత్రీ, చండీహోమాలు జరిగాయి. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

లలితా త్రిపుర సుందరీదేవిగా..

గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో మంగళవారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి సాయంత్రం ప్రత్యేక హారతులు ఇచ్చారు.



మల్లికార్జునపేట శివాలయంలో లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారి దర్శనం

నిర్లక్ష్యంతోనే ప్రాణాంతక వ్యాధుల వ్యాప్తి

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా ధ్వజం



యూపీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శిస్తున్న నూరిఫాతిమా

పట్నంబజారు: ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వంతో ప్రజల ప్రాణాల మీదకు తీసుకొస్తున్నారని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ధ్వజమెత్తారు. నియోజకవర్గంలోని ప్రగతినగర్, దుర్గానగర్, యానాదికాలనీల్లో మంగళవారం పర్యటించారు. స్థానికులను పరామర్శించారు. తాగునీటి సరఫరా గురించి ఆరా తీశారు. ఈక్రమంలో అక్కడకు తాగునీటి సరఫరాకు వచ్చిన తాగునీటిని తాగి పరిశీలించారు. మురుగుకాల్వలు, రోడ్లులో నిలిచిపోయిన మరుగు, వర్షం నీటిని పరిశీలించి అపరిశుభ్ర వాతావరణం నెలకొని ఉండటాన్ని గమనించారు. ఆయా ప్రాంతాల్లో స్థానికుల నివాసాలకు వెళ్లి నీటి సరఫరా ఎలా వస్తోందని అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచి స్థానికంగా ఉన్న యూపీహెచ్‌సీకి వెళ్ళి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ నిత్యం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు కనీసం తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించకపోవటం సిగ్గుచేటన్నారు. వంద మందికిపైగా ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నా ఇప్పటికి లోపలను సరిచేయలేకపోవటం ప్రభుత్వ అసమర్థతను చాటి చెబుతోందని విమర్శించారు. ఇప్పటికే వృద్ధురాలు మృతి చెందిందనే వాదనలు వినవస్తున్నాయని, నీ నేపథ్యంలో పరిస్థితి చేయి దాటితే.. ప్రభుత్వం, అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎక్కడ చూసినా పారిశుధ్యం అధ్వానంగా ఉందని, అధికారులకు శివారు కాలనీలు అంటే చిన్నచూపు ఎందుకని ప్రశ్నించారు. కేవలం ఓట్లు కోసం శివారు కాలనీలో ప్రదక్షిణలు చేసే ప్రజాప్రతినిధులు సమస్యలు ఉన్నాయంటే.. ఎందుకు స్పందించరో చెప్పాల్సిన అవసరం ఉందని నిలదీశారు. తాగునీటి సరఫరాలో కలుషిత నీరు రాకుండా అధికారులు చర్యలు తీసుకోకుంటే.. పోరు తప్పదని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులపై ఆందోళన అవసరం లేదు

- జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా
- డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన



నగరంలో పర్యటిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

నెహ్రూనగర్: జిల్లాలో సీజనల్ వ్యాధులపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కొద్దిపాటి అప్రమత్తతో ప్రభుత్వం జారీ చేస్తున్న ఆరోగ్య సూచనలు, వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. మంగళవారం ఉదయం డయేరియా కేసులు నమోదైన ప్రాంతాలైన ప్రగతి నగర్, వర్కర్స్ కాలనీ, రామిరెడ్డి తోట, సీతానగర్, నెహ్రూనగర్‌లో తాగునీరు సరఫరా, పారిశుద్ధ్యం, వైద్యసేవలను తనిఖీ చేశారు. ఆమె కమిషనర్ పులి శ్రీనివాసులు, శాసనసభ్యులు మహమ్మద్ నసీర్ అహ్మద్ ఉన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జీజీహెచ్‌లో 92 మంది డయేరియా లక్షణాలతో చికిత్స పొందుతున్నారని, వీరందరి ఆరోగ్యం స్థిరంగా ఉందని చెప్పారు. డయేరియా నమోదు అయిన ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు వచ్చే వరకు పూర్తిగా పానీ పూరి అమ్మకాలు నిలిపివేసినట్లు వివరించారు. ప్రగతి నగర్‌లో రెండు, రామిరెడ్డి నగర్‌లో ఒకటి చొప్పున కలరా కేసులు నమోదు అయ్యాయన్నారు. ప్రస్తుతం అందరి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి విజయలక్ష్మి, ఇన్‌చార్జి ఎస్‌ఈ సుందరరామిరెడ్డి, ఇన్‌చార్జి సీఎంహెచ్ శోభారాణి, స్పెషల్ ఆఫీసర్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పి.మురళి, కమ్యూనిటీ డీసీజ్ వైద్యనిపుణులు డాక్టర్ శివగోపాల్, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ ఎస్‌ఈ దాసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తత అవసరం

నెహ్రూనగర్: నగర పాలక సంస్థ పరిధిలో డయేరియా అనుమానిత, నిర్ధారిత ప్రాంతాల్లో ప్రజలకు డయేరియా వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. మంగళవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజల్లో డయేరియాపై అపోహలు తొలగించేలా, సొంత వైద్యం కాకుండా హాస్పిటల్స్‌లో చికిత్స తీసుకొనేలా సచివాలయాల కార్యదర్శులు, ఏఎన్ఎంలు ఇంటింటికి అవగాహన కలిగించాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రధానంగా ఆర్‌ఓ ప్లాంట్లు, బోర్ వెల్స్ నుంచి శాంపిల్స్ సేకరించాలని, వాటిని మొబైల్ వెహికల్ ల్యాబ్ లేదా జీఎంసీలోని సెంట్రల్ ల్యాబ్‌కు పంపాలన్నారు. డివిజన్ల పరిధిలోని ఆర్‌ఓ ప్లాంట్ల అనుమతుల వివరాలను అందించాలని ఆదేశించారు. కేసులు నమోదవుతున్న ప్రాంతాలలో ప్రతి లైను పరిశీలించి డ్రెయిన్లలో పైప్ లైన్లు ఉంటె వెంటనే షిఫ్ట్ చేయాలని, ప్రత్యేక డ్రైవ్ ద్వారా సమగ్ర పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. సదరు సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సి.హెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జి ఎస్‌ఈ సుందర రామిరెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మీ నారాయణ, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపంతోనే కలరా కేసులు!



స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సీపీఎం నగర కార్యదర్శి నళినికాంత్

లక్ష్మీపురం: నగరంలో వివిధ ప్రాంతాలలో కలరా, డయేరియా వ్యాప్తికి మౌలిక సదుపాయాలు లేకపోవటం, పారిశుద్ధ్యం నిర్వహణ అస్తవ్యస్తమే కారణమని సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ ఆరోపించారు. మంగళవారం పాత గుంటూరులోని ప్రగతినగర్‌లో ఆ పార్టీ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు విపరీతంగా ఉంటున్నాయని, మురుగు కాలువలు నిర్మించమని ఎన్ని సార్లు అధికారులకు విన్నవించుకున్నా నిర్మాణం చేయలేదని స్థానిక ప్రజలు చెబుతున్నారని చెప్పారు. ప్రగతినగర్‌లో మురుగు కాలువలు లేకపోవటంతో ఇళ్ల ముందు నీరు నిలిచి ఉండటం, దోమలు తీవ్రంగా ఉండటంతోనే కలరా, డయేరియా వంటి వ్యాధులు సంభవిస్తున్నాయని అన్నారు. పేదలు నివసించే కాలనీలలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సక్రమంగా పారిశుద్ధ్య పనులు చేయించటం లేదని, ప్రస్తుత వర్షాలతో సమస్య ఇంకా ఎక్కువ అయ్యిందని ఆరోపించారు. పేదలు నివసించే కాలనీలలో త్వరితగతిన మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కట్లగుంట శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్మికుల క్లెయిమ్‌లను పరిష్కరించాలి



మాట్లాడుతున్న పుప్పాల సత్యనారాయణ

లక్ష్మీపురం: రాష్ట్ర వ్యాప్తంగా 46 వేలకుపైగా పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే క్లియర్ చేయాలని, లేని పక్షంలో సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నివాసాలను ముట్టడించాల్సి వస్తుందని ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ హెచ్చరించారు. కొత్తపేటలోని జిల్లా సీపీఐ కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సెస్ రూపంలో వందల కోట్ల రూపాయలు లేబర్ డిపార్ట్‌మెంట్‌కు చేరుతున్నా, ఆ నిధులు కార్మికుల సంక్షేమానికి వినియోగించకపోవడం ఆందోళనకరమని చెప్పారు. కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని గుర్తు చేశారు. గతంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డుకు కోటి రూపాయలు కేటాయిస్తామని చెప్పారని, కానీ అధికారంలోకి వచ్చాక దాని ఊసే లేదన్నారు. ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు మాట్లాడుతూ కార్మికుల కార్డులు రెన్యువల్ చేయడం, కొత్త కార్డులు జారీ చేయడం, లేబర్ శాఖలో తగిన సిబ్బందిని నియమించడం వంటి అంశాలను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ది గుంటూరు సిటీ కార్పెంటర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి దేగల వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గుర్రం జాషువా జీవితం ఆదర్శనీయం

గుంటూరు మెడికల్: కవి కోకిల గుర్రం జాషువా జయంతి సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను భారీ స్థాయిలో నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లపై బీజేపీ నేతలు మంగళవారం అరండల్ పేటలోని రంగనాయక స్వామి గుడిలో సమావేశమయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన దర్శనపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ పాల్గొన్నారు. సమావేశంలో ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ధార అంబేడ్కర్, నాయకులు కంతేటి బ్రహ్మయ్య, బూసి స్టాలిన్, సీనియర్ నాయకులు పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, డాక్టర్ టివి రావు, చరక కుమార్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షురాలు మంత్రి సుగుణ, సాధు రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు దేసు సత్యనారాయణ, బజరంగ్ రామకృష్ణ, తోట శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి మండల అధ్యక్షులు వక్కలగడ్డ తిరుమల రావు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్‌లో అంతర్గత బదిలీలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో అంతర్గత బదిలీలు చేస్తూ నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల గుంటూరుకు బదిలీపై వచ్చిన టీపీఎస్ సత్యనారాయణకు డివిజన్లు కేటాయించారు. గతంలో పనిచేసిన వారికి మార్పులు చేర్పులు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు: విద్యుత్ లైనుల మరమ్మతుల దృష్ట్యా బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు టౌన్–2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.గురవయ్య మంగళవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బ్రాడీపేట, పండరీపురం, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

దేశీయ వైద్యం బలోపేతానికి కృషి



గృహ వైద్యం గోడ పత్రికల ఆవిష్కరణ

నగరంపాలెం: మానవుని సంపూర్ణ ఆరోగ్యం ప్రకృతితో ముడిపడి ఉందని ఏపీ రాష్ట్ర ఔషధ, సుగంధ మొక్కల బోర్డు సీఈఓ ఆవుల చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఏపీ దేశీయ వైద్య సంఘం, ఏపీ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు సంయుక్తంగా అరండల్‌పేట ఆర్య సమాజం సమావేశ మందిరంలో మంగళవారం ఔషధ మొక్కల నిర్వహణ, వినియోగంపై రాష్ట్ర స్థాయి సదస్సు/ ఔషధ మొక్కల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి సంబంధించి ప్రతి ఔషధం మొక్కల ద్వారా ఉపశమనం, నివారణ లభిస్తుందని అన్నారు. జిల్లా అటవీశాఖ అధికారిణి హిమశైలజ మాట్లాడుతూ ఔషధ, సుగంధ మొక్కల నర్సరీలను భారీగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సదస్సుకి అధ్యక్షత వహించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శెట్టి వీరవెంకటసత్యనారాయణ, గౌరవాధ్యక్షులు డాక్టర్ గౌరీష్‌బాబు మాట్లాడుతూ 53 ఏళ్ల క్రితం వైద్య భూషణ డాక్టర్ పిల్లలమర్రి వెంకటరామయ్య సారథ్యంలో దేశీయ వైద్య సంఘం ఏర్పడిందని అన్నారు. అనంతరం నాయుడు ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. జిల్లాల వారీగా ఆయుర్వేద, యునాని, ప్రకృతి వైద్యులు వర్క్‌షాప్‌నకు హాజరై, అనుభవాలు వివరించారు. సదస్సులో బోర్డు డీఈఓ కె.ప్రదీప్‌కుమార్, సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ నామాల శ్రీనివాసరావు పాల్గొనగా, అనంతరం గృహ వైద్యం గోడ పత్రికలను ఆవిష్కరించారు.

విద్య, వైద్య వ్యవస్థలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్య, వైద్య వ్యవస్థలను ప్రభుత్వ రంగంలో బలోపేతం చేయాల్సిన అవసరముందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు అన్నారు. మంగళవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జనవిజ్ఞానవేదిక జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. తొలుత మహాకవి గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విజయవాడలోని గురజాడ ఇంటిని ప్రభుత్వం స్మారక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఏఎస్ ప్రసాద్ మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి టి.జాన్‌బాబు మాట్లాడుతూ అక్టోబర్‌లో ఉపాధ్యాయులకు ఓరియెంటేషన్ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు ఎం.ఉదయ్ భాస్కర్, ప్రొఫెసర్ ఎస్.వేణుగోపాలరావు, జి.వెంకట్రావు, బి.ప్రసాద్, శివపూర్ణయ్య, బురాన్, ఎస్ఎం సుభానీ, టీఆర్ రమేష్, ఇ.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగుల్లో వృత్తి సామర్థ్యం యోగతో సాధ్యం

గుంటూరు మెడికల్: ఉద్యోగుల్లో చురుకుదనం, వృత్తి సామర్థ్యం యోగతో సాధ్యమవుతుందని సీజీహెచ్ఎస్(కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం) సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.విద్య అన్నారు. స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంపాలెంలోని సీజీహెచ్ఎస్ వెల్ నెస్ కేంద్రంలో మహిళా ఉద్యోగులు, పెన్షనర్లకు 'యోగ, ధ్యానం ద్వారా ఒత్తిడి నివారణ' అనే అంశం పై అవగాహనా సదస్సు నిర్వహించారు. సదస్సులో డాక్టర్ విద్య మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలోని సమస్యలకు యోగతో చక్కని పరిష్కారం లభిస్తుందన్నారు. మానసిక ప్రశాంతత యోగతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ బి.హేమా సుందరి, ఫార్మాసిస్ట్ సయ్యద్ అయేషా బేగం పాల్గొన్నారు.

రాణించడానికి శారీరక వైకల్యం అవరోధం కాదు

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: జీవితంలో ఎదిగేందుకు శారీరక వైకల్యం అవరోధం కారాదని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. మంగళవారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో అంతర్జాతీయ బధిరుల దినోత్సవం నిర్వహించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ వినికిడి లోపంతో పాటు బధిరుల సంఘం సాధించిన విజయాల వైపు సాధారణ ప్రజలు, ప్రభుత్వాలు దృష్టిని ఆకర్షించేందుకు ప్రతియేటా సెప్టెంబర్ చివరి వారంలో అంతర్జాతీయ బధిరుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. భగవంతుడు ఎల్లప్పుడూ మీకు తోడుగా ఉంటారని, ప్రభుత్వ పరంగా సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖాధికారిణి దుర్గాబాయి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, బధిరులు పాల్గొన్నారు.

స్వర్ణభారతినగర్‌లో డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమం



గుంటూరు రూరల్: నిషేధిత మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సౌత్ డీఎస్పీ భానోదయ తెలిపారు. మంగళవారం 41వ డివిజన్ స్వర్ణభారతినగర్‌లో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీస్ శాఖ, ఈగల్ విభాగంతో కలిసి ప్రత్యేకంగా డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ వాడకం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, ప్రతి యువకుడు, ప్రతి వ్యక్తి డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని సంకల్పం చేసుకోవాలన్నారు. డ్రగ్స్ సరఫరా, విక్రయం, వాడకం చట్ట రీత్యా నేరమని, అటువంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో డ్రగ్స్‌పై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ వంశీధర్, ఎస్సై శిరీష, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సెబీ, స్టాక్ మార్కెట్‌పై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల కామర్స్ విభాగ ఆధ్వర్యంలో విద్యార్థినులకు సెబీ ట్రైనర్లతో స్మార్ట్ ఇన్వెస్టర్ ఎవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి తెలిపారు. ఈసందర్భంగా వాణిజ్యశాస్త్రం చదువుతున్న విద్యార్థులకు సెబీ, స్టాక్ మార్కెట్‌పై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కళాశాల తెలుగు విభాగ ఆధ్వర్యంలో మహాకవి గురజాడ వెంకట అప్పారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

ఏఐ, సైబర్ సెక్యూరిటీపై ఓరియంటేషన్ ప్రోగ్రాం



మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్ నరేంద్ర

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల డాక్టర్ వైఆర్ హరగోపాల్‌రెడ్డి సెమినార్ హాల్‌లో ఏఐ, సైబర్ సెక్యూరిటీపై ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ ఐబీఎంకు చెందిన నరేంద్ర ముఖ్య వక్తగా విచ్చేశారు. ఏపీ ఎస్ఎస్‌డీసీ ఐబీఎం స్కిల్ బిల్డ్, ఎడ్యునెట్ ఫౌండేషన్ సంయుక్తంగా ఇంజినీరింగ్, ఎంఎస్ సీఎంసీపీ విద్యార్థులకు నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్‌గా విచ్చేసిన నరేంద్ర మాట్లాడుతూ ఏఐ టూల్స్, హాల్యూజినేషన్, జనరేటివ్ ఏఐ, గూగుల్ ట్రెండ్స్, జనరేటింగ్ ఇమేజెస్ తదితర అంశాలపై వివరించారు. ఐబీఎం స్కిల్ బిల్డ్ పోర్టల్‌లో ఉన్న 18 ఉచిత కోర్సులపై అవగాహన కల్పించారు. బుధవారం ఆర్ట్స్, ఫార్మసీ ఆర్కిటెక్చర్ విద్యార్థులకు వాణిజ్య భవన్‌లో జరుగుతుందని, ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ తౌసిఫ్ అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ఎస్‌డీసీ యూఎస్‌డీవో ఎండీ రఫీ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య లింగరాజు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ చంద్రమౌళి, సీఎస్‌సీ విభాగపు సమన్వయకర్తలు డాక్టర్ చైతన్య పాల్గొన్నారు.

మానవాళికి గొప్ప వరం ఆయుర్వేదం



ధన్వంతరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి జయంతిని జాతీయ ఆయుర్వేద దినోత్సవంగా జరుపుకోవడం మన మూలాలను స్మరించుకోవడమేనని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. మంగళవారం జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెడెక్స్, మెడి ఎయిమ్స్ క్యాంపస్‌లలో ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి విగ్రహంతో పాటు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మన పూర్వీకులు మానవాళికి ఇచ్చిన గొప్ప వరం ఆయుర్వేదమని, దానిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యుడు కొండా వెంకటేశ్వర్లు, భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు పాల్గొన్నారు.